
సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 16 । ఫిబ్రవరి । 2025



'చింతలపూడి' ఎండమావేనా?
కూటమి ప్రభుత్వం తీరు చూస్తుంటే చింతలపూడి ఎత్తిపోతల పథకం ఇక ఎండమావేనా అనిపిస్తోంది.
8లో ▸



మామిడిలో తెగుళ్ల బెడద
మామిడి తోటలకు నల్ల తామర, బూడిద తెగుళ్లు సోకడంతో దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉంది.
8లో ▸



కాలువల్లో వైరస్ కోళ్లు
వైరస్‌తో చనిపోయిన కోళ్లకు అత్తిలి కాలువ నిలయంగా మారింది. దీంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు.
8లో ▸

న్యూస్‌రీల్

జనన, మరణాల నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న జడ్జి బుల్లికృష్ణ

ఏలూరు (టూటౌన్): జనన, మరణాలను తప్పనిసరిగా నమోదు చేయాలని అదనపు సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బుల్లికృష్ణ సూచించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్ఏసీ) ఎం.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో జనన, మరణాల నమోదు, కుల, వివాహ ధ్రువీకరణ పత్రాల జారీ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ధ్రువీకరణపత్రాల జారీకి సంబంధించి సూచనలు, నిబంధనలను ప్రతి కార్యాలయం వద్ద అధికారులు బహిర్గతం చేయాలన్నారు. పంచాయతీ, సచివాలయాల పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ అంబరీష్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ శేషగిరి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పీఎస్‌వీ మునేశ్వరరావు, ప్యానల్ లాయర్ కూనా కృష్ణారావు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్



కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి తపాలా బ్యాలెట్‌కు అవకాశం కల్పించినట్టు తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈనెల 27న పోలింగ్ జరుగనుందన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఫాం–12ను ఈనెల 20న సాయంత్రం 5 గంటలోపు సమర్పించాలన్నారు. ఫాం–12ను ఏలూరు డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఫాం–12తో పాటు డ్యూటీ కేటాయింపు ఉత్తర్వులు జతచేయాలని కోరారు.

సమన్వయంతో లక్ష్యాలు సాధించాలి

భీమవరం(ప్రకాశం చౌక్): అధికారులు సమన్వయంతో లక్ష్యాలు సాధించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో రెవెన్యూ సదస్సులు, రీ సర్వే గ్రామ సభలు, పీజీఆర్ఎస్ ఫిర్యాదులు, నిరుపేదల ఇళ్ల స్థలాల పరిశీలన, 22–ఏ కేసులు, ఏపీ సేవా సర్వీసులు, కోర్టు కేసులు, పైలెట్ రీ సర్వే గ్రామాలు తదితర 13 అంశాలపై జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. పెండింగులో ఉన్న భూ సంబంధిత కోర్టు కేసులు, భూ సంబంధిత తగదాలు తదితర కేసులను త్వరితగతిన పరిష్కారమయ్యేలా చూడాలన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 102 మంది గైర్హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు 3,097 మందికి 2,995 మంది హాజరుకాగా.. 102 మంది గైర్హాజరయ్యారు. జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు 40 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఉదయం షిఫ్టులో 1,641 మందికి 1,573 మంది, మధ్యాహ్నం షిఫ్టులో 1,456 మందికి 1,422 మంది హాజరయ్యారని ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.యోహాన్ తెలిపారు.

హెచ్‌ఎం సుబ్రహ్మణ్యంకు షోకాజ్ నోటీస్

జంగారెడ్డిగూడెం: లక్కవరం రెడ్డిపేట ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యంకు జిల్లా విద్యాశాఖాధికారి వెంకట లక్ష్మమ్మ శనివారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. పాఠశాలలో అన్యమత ప్రచారంపై తల్లితండ్రుల ఫిర్యాదు నేపథ్యంలో శుక్రవారం విచారణ నిర్వహించారు. విచారణలో తేలిన అంశాల ఆధారంగా డీఈఓ షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ మేరకు విద్యాశాఖాధికారులు బి.రాముడు, జి.రాములు సుబ్రహ్మణ్యానికి షోకాజు నోటీసు అందజేశారు.

డీసీసీబీ సీఈఓగా సింహాచలం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) ముఖ్య కార్యనిర్వహణాధికారిగా పి.సింహాచలం నియమితులయ్యారు. ఆయన గతంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వివిధ హోదాల్లో పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేశారు. కాగా ప్రస్తుతం ఈ స్థానంలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఆప్కాబ్ అధికారి ఎంఎస్ఆర్‌కే తిలక్‌ను తిరిగి మాతృ సంస్థకు బదిలీ చేశారు. సింహాచలం సోమవారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

వైద్యసేవ.. అవినీతి తోవ

ప్రైవేట్ ఆస్పత్రుల ఇష్టారాజ్యం

- ఉచిత సేవల్లో చేతివాటం
- ఎన్టీఆర్ వైద్యసేవపై కొరవడిన అజమాయిషీ
- రోగుల నుంచి సొమ్ములు వసూలు చేస్తున్న నెట్‌వర్క్ హాస్పిటల్స్
- ఉన్నతస్థాయికి బాధితుల ఫిర్యాదు
- జిల్లాలో పలు ఆస్పత్రులకు జరిమానాలు



సాక్షి, భీమవరం: ఉచిత వైద్యసేవలో పలు నెట్‌వర్క్ ఆస్పత్రులు చేతివాటం ప్రదర్శిస్తున్నాయి. రోగుల నుంచి అందినంత పిండుకుంటున్నాయి. ఆస్పత్రుల తీరుపై కొందరు ఉన్నతస్థాయికి ఫిర్యాదులు చేయడంతో జిల్లాలోని ఒక ఆస్పత్రికి రూ.3.02 లక్షల జరిమానా విధించగా మరికొన్నింటిపై విచారణ జరుగుతున్నట్టు తెలిసింది. ఇటీవల చోటుచేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది.

జిల్లాలో 30 నెట్‌వర్క్ హాస్పిటల్స్

జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) అందించే ప్రభుత్వ ఆస్పత్రులు 42 ఉండగా ప్రైవేట్ ఆస్పత్రులు 30 వరకు ఉన్నాయి. ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో 22 మల్టీ స్పెషాలిటీ, ఎనిమిది డెంటల్ ఆస్పత్రులు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ పేరును కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్యసేవగా మార్చింది. ఈ పథకం కింద ఉచిత వైద్యసేవ పొందే రోగికి ఉచిత అడ్మిషన్, అవసరమైన వైద్య పరీక్షలు, శస్త్రచికిత్సలతో పాటు ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే వరకు మందులు, రూమ్ సదుపాయం, అల్పాహారం, రెండు పూటలా భోజనం, వైద్యసేవలు అందించాలి. డిశ్చార్జ్ సమయంలో రోగికి సరిపడా మందులు ఇవ్వాలి.

కొరవడిన అజమాయిషీ : ఎన్టీఆర్ వైద్యసేవ పథకం అమలులో సంబంధిత అధికారులు అజమాయిషీ కొరవడటంతో ప్రైవేట్ ఆస్పత్రుల ఇష్టారాజ్యంగా మారింది. మత్తు ఇచ్చేందుకనో, అప్రూవల్ రావడానికి ఆలస్యమవుతుందనో, బయట కొన్ని వైద్య పరీక్షలు చేయించాలనో పలు కారణాలు చెప్పి నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రుల్లో రోగుల నుంచి డబ్బులు గుంజుతున్నారు. డెలివరీలకు సైతం సొమ్ములు చెల్లించాలంటున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని ఆస్పత్రుల్లో ఉచిత వైద్య సేవల రోగుల నుంచి వసూలు చేసిన సొమ్ములకు రశీదులు సైతం ఇస్తుండటం గమనార్హం. అధిక శాతం మంది రోగులు ఎందుకొచ్చిన గొడవలే అన్నట్టుగా అడిగినంత చెల్లిస్తుండగా, కొందరు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళుతున్నారు. ఆస్పత్రి యాజమాన్యాలతో తమకున్న పరిచయాలతో చాలా వరకు ఫిర్యాదులను జిల్లాస్థాయిలోని కొందరు అధికారులు బుట్టదాఖలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. బాధితులు వెనక్కి తగ్గకుండా నిలబడిన కేసుల్లో మాత్రం ఉన్నతస్థాయి నుంచి సంబంధిత ఆస్పత్రులపై చర్యలు తప్పనిసరి అవుతున్నాయి.

గతంలో ప్రతిష్టాత్మకంగా..

గత ప్రభుత్వం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలుచేసింది. క్యాన్సర్ వంటి ఖరీదైన జబ్బుల చికిత్సకు పరిమితి లేకుండా అవసరమైన సాయం అందించారు. పథకం కింద అందించే 1,059 చికిత్సల సంఖ్య (ప్రొసీజర్ల)ను 3,257కి పెంచారు. శస్త్రచికిత్స అనంతరం రోగి కోలుకునే వరకు జీవనభృతి కోసం వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద ఆర్థిక సాయం కూడా అందించేవారు. ఇంటికి వెళ్లిన పది రోజుల తర్వాత ఆస్పత్రికి వచ్చి ఉచితంగా వైద్య సేవలు పొందే వీలు కల్పించారు. అవసరమైన చికిత్సలకు ఏడాది పాటు డాక్టర్ సంప్రదింపులు, వైద్య పరీక్షలు, మందులు కూడా ఉచితంగా ఇచ్చేవారు. అక్రమాల నివారణకు 14400 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసే వీలు కల్పించారు. అలాగే కుటుంబానికి రూ.5 లక్షలు ఉన్న వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు పెంచడం ద్వారా పేదల ఆరోగ్యానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత భరోసా కల్పించారు. కాగా కూటమి ప్రభుత్వం ఆరోగ్య ఆసరాకు ఎసరు పెట్టింది. ఆస్పత్రులకు బకాయిల విడుదలలో జాప్యంతో ఉచిత వైద్య సేవల కోసం రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

తణుకులోని ఆస్పత్రికి రూ.3.10 లక్షల జరిమానా

ఉచిత వైద్య సేవ నిబంధనలు మీరి తమ నుంచి డబ్బులు వసూలు చేసినట్టు ముగ్గురు బాధితులు ఇచ్చిన ఫిర్యాదులపై తణుకులోని ఒక ప్రైవేట్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రికి రూ.3.02 లక్షల జరిమానాను ఉన్నతాధికారులు విధించారు. వీటిలో ఒక రోగి నుంచి రూ.10 వేలు వసూలు చేయగా అందుకు పది రెట్లు రూ.లక్ష, మరో రోగి నుంచి రూ.15,000 వసూలు చేసినందుకు గాను రూ.1.5 లక్షలు, మరో రోగి నుంచి రూ.5,200 వసూలు చేసినందుకు గాను రూ.52,000 జరిమానాగా విధించారు. జిల్లాలోని భీమవరం, పాలకొల్లులోని మరో ఐదు ఆస్పత్రుల్లో రోగుల నుంచి అక్రమ వసూళ్లపై ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టుకు ఫిర్యాదులు అందినట్టు తెలుస్తోంది. వీటిని మసిపూసి మారేడుకాయ చేసే పనిలో జిల్లాలోని సంబంధిత విభాగానికి చెందిన కొందరు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఆస్పత్రులపై జరిమానాల విషయమై జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి భానునాయక్‌ను సంప్రదించగా వాస్తవమేనని తెలిపారు.

మహాశివరాత్రికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు

డీఆర్వో వెంకటేశ్వర్లు



సమీక్షిస్తున్న డీఆర్వో వెంకటేశ్వర్లు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో ఈనెల 26న జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా ఏఎస్పీ వి.భీమారావు అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం అధికారులతో సమీక్షించారు. డీఆర్వో మాట్లాడుతూ జిల్లాలోని పాలకొల్లు, భీమవరం, సత్తారామేశ్వరం, జుత్తిగ, ఆచంట, పెనుగొండ, లక్షణేశ్వరం, యనమదుర్రు, శివదేవునిచిక్కాల ఆలయాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు తదితర ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లా ఏఎస్పీ వి.భీమారావు మాట్లాడుతూ భీమవరం మావుళ్లమ్మ ఉత్సవాల మాదిరిగా శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఆధునిక టెక్నాలజీ సీసీ, సోలార్, డ్రోన్ కెమెరాలను వినియోగించాలన్నారు. బందోబస్తుకు సచివాలయాల్లోని మహిళా పోలీసులను వినియోగిస్తామన్నారు. అక్రమ మద్యం, మత్తు పదార్థాలు, జూదం జరగకుండా చూడాలన్నారు. జిల్లా ఎండోమెంట్ అధికారి ఈవీ సుబ్బారావు, జిల్లా అగ్నిమాపకదళ అధికారి బి.శ్రీనివాసరావు, ఆర్‌బీఎస్ కేపీఓ సీహెచ్ భావన, కో–ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎం.సన్యాసిరావు, డిప్యూటీ తహసీల్దార్ ఈ.నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ లేకనే వైరస్ వ్యాప్తి

పశుసంవర్ధక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్



యలమంచిలి : ఊటాడలోని ఫారంలో చనిపోయిన కోళ్లు

తణుకు అర్బన్: కోళ్ల ఫారాల్లో రైతులు పూర్తిస్థాయి శానిటైజేషన్ పాటించకపోవడంతోనే వైరస్‌లు వ్యాప్తిస్తున్నాయని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్ అన్నారు. తణుకు మండలం వేల్పూరు రెడ్‌జోన్‌లోని కోళ్ల ఫారాలను కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. బాదంపూడి, వేల్పూరుల్లో కోళ్లకు వ్యాపించిన వైరస్ గతంలోనూ వచ్చిన దాఖలాలు ఉన్నాయన్నారు. ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే కల్లింగ్ ప్రక్రియ పూర్తయిందని, శానిటైజేషన్ కార్యక్రమం జరుగుతోందని చెప్పారు. దీనివల్ల మానవాళికి ఎటువంటి ఇబ్బందులూ లేవని, అపోహలను నమ్మవద్దని తెలిపారు. కోళ్ల ఫారాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పూర్తిస్థాయిలో పాటించడం లేదని, ముఖ్యంగా ఫారాల్లో శానిటైజేషన్ సక్రమంగా లేకపోవడమే వైరస్‌లకు ప్రధాన కారణమని చెప్పారు. రానున్న రోజుల్లో పూర్తిస్థాయి శానిటైజేషన్ చేసేలా కోళ్ల ఫారాల యాజమాన్యాలకు దిశానిర్దేశం చేస్తామన్నారు. కోళ్ల ఫారాల వద్ద పనులు పూర్తయిన తర్వాత మూడు నెలల పాటు ఫారాలను సీజ్ చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఒక ఫారం వద్ద ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌లో కోళ్ల మరణాలు, తీసుకున్న జాగ్రత్తలు వంటి ఫొటోలను ఆయన పరిశీలించారు. వైరస్ సోకిన కృష్ణానందం పౌల్ట్రీస్‌లో నిర్వహిస్తున్న శానిటైజేషన్ పనులను స్వయంగా పర్యవేక్షించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మురళీకృష్ణ, తహసీల్దార్ దండు అశోక్‌వర్మ, మండల పశువైద్యాధికారి శంకర్ భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాదంపూడిలో 30 వేల కోళ్ల ఖననం

ఉంగుటూరు: బాదంపూడిలోని వెంకట మణికంఠ ఫారంలో బర్డ్‌ఫ్లూ సోకిన 30 వేల కోళ్లను శనివారం ఖననం చేశారు. ఈ ప్రక్రియను పశుసంవర్ధక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్, రాష్ట్ర డైరెక్టర్ దామోదరనాయుడు పరిశీలించారు. జిల్లాకు చెందిన పశువైద్యులు, సహాయకులు సుమారు 100 మంది జేడీ టి.గోవిందరాజు పర్యవేక్షణలో కోళ్ల ఖననం చేశారు. ఈ ఫారం సమీపంలోని మరో ఫారంలోనూ కోళ్ల ఖననం ప్రక్రియ కొనసాగింది. మండలంలో చెక్‌పోస్టులు, మెడికల్ క్యాంపులు కొనసాగుతున్నాయి. గ్రామంలో శానిటేషన్ పనులు కొనసాగుతున్నాయి. తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ రాజ్ మనోజ్ పర్యవేక్షిస్తున్నారు.



తణుకు అర్బన్ : వేల్పూరులో ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న పీఎస్ రాజశేఖర్, కలెక్టర్ నాగరాణి

ఊటాడలో 1,500 కోళ్లు మృతి

యలమంచిలి: మండలంలోని ఊటాడ గ్రామంలో నెక్కంటి సతీష్‌కుమార్ అనే కోళ్ల రైతు ఫారంలో ఉదయం 1,500 బ్రాయిలర్ కోళ్లు మృతిచెందాయి.



ఉంగుటూరు : బాదంపూడిలో ఫారం వద్ద కోళ్ల ఖననాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

పశుసంవర్ధక శాఖ అధికారులు కోళ్ల నుంచి శాంపిల్స్ సేకరించి విజయవాడ, భోపాల్ పరీక్షా కేంద్రాలకు పంపించారు. అనంతరం పొక్లెయిన్‌తో కోళ్లను గొయ్యిలో ఖననం చేశారు. పశుసంవర్ధక శాఖ భీమవరం ప్రాంతీయ ఉప సంచాలకుడు జవార్ హుస్సేన్ మాట్లాడుతూ రెండు రోజుల క్రితమే మేడపాడులో కూడా ఇలానే 5,500 కోళ్లు చనిపోయాయని తెలిపారు. దీంతో ఈ రెండు గ్రామాల పరిధిలో కిలోమీటర్ వరకు రెడ్‌జోన్‌గా ప్రకటించామన్నారు. ల్యాబ్ నివేదిక వచ్చిన తర్వాత ఇతర చర్యలు తీసుకుంటామన్నారు. పాలకొల్లు ప్రాంతీయ సహాయ సంచాలకుడు డాక్టర్ గంజనబోయిన మల్లేశ్వరరావు, మండల పశు వైద్యాధికారి పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి ఉన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని పారదోలుదాం

కలెక్టర్ నాగరాణి



స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): క్యాన్సర్‌కు ప్లాస్టిక్ కారణంగా ఉందని, ప్రజలు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ నిర్మూలనకు ముందడుగు వేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం భీమవరం కొత్త బస్టాండ్ ఎదురుగా హైస్కూల్ ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భీమవరం పరిసర గ్రామాల్లో ప్రతి రెండు, మూడు కుటుంబాల్లో ఒకరు క్యాన్సర్ పేషెంట్ కావడానికి ప్లాస్టిక్ కారణంగా ఉందని తెలిసి ఆశ్చర్యపోయామన్నారు. ప్లాస్టిక్ నిర్మూలనకు ఉద్యమ రూపంలో ముందడుగు వేయాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని కోరారు. వ్యాపారులు ఉత్తర్వులను కచ్చితంగా పాటించాలన్నారు. కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ వస్తువుల స్థానంలో స్టీల్ వాటర్ బాటిల్స్, స్టీల్ ప్లేట్స్, స్టీల్ టీ కప్స్ వినియోగిస్తున్నట్టు చెప్పారు. జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి ప్లాస్టిక్ కవర్లను అందరూ తిరస్కరించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞను చేయించారు. కలెక్టర్ చేతులమీదుగా మహిళలకు గుడ్డ సంచులు, ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువులను వ్యాపారులకు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

చిరు వ్యాపారులపై జరిమానాలు తగదు

ప్లాస్టిక్ నిషేధం పేరుతో పట్టణంలో చిరు వ్యాపారులపై జరిమానాలు విధించడం కాదని, ఎక్కడ నుంచి ప్లాస్టిక్ ఉత్పత్తులు వస్తున్నాయో తెలుసుకుని ఆపాలంటూ మాజీ కౌన్సిలర్ మెంటే గోపి అన్నారు. వెంటనే కలెక్టర్ కలుగజేసుకుని వ్యాపారులు, ప్రజలకు అవగాహన కల్పించి ప్లాస్టిక్ నిషేధించాలని అవగాహన కల్పిస్తున్నామన్నారు. అవగాహన లేకుండా మాట్లాడవద్దని హితవుపలికారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సుమన్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కె.సుమన్, సహాధ్యక్షుడు గంట సంపత్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఏలూరులోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన సంఘ జిల్లా కార్యవర్గ సమావేశంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల మంత్రివర్గ సమావేశంలో ఆప్కాస్ రద్దుపై వస్తున్న ప్రకటనలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గతంలో కంటే మెరుగైన విధానాన్ని తీసుకువచ్చి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి వారి కుటుంబాల్లో వెలుగులు నింపాలన్నారు. జిల్లా అధ్యక్షుడు కె.నాగభూషణం, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి పి.సుశీల పాల్గొన్నారు.

ముగిసిన రోడ్డు భద్రత మాసోత్సవాలు



మాట్లాడుతున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): 18 ఏళ్లు నిండని వారికి మోటార్ వాహనాలు నడిపే హక్కు లేదని అడిషనల్ ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. స్థానిక ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో శనివారం 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రహదారి భద్రతా నియమాలు అందరూ పాటించాలన్నారు. హెల్మెట్, సీటు బెల్టు తప్పక ధరించాలన్నారు. మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలో 50కు పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం ఆర్డీఓలు కృష్ణారావు, మదానీ మాట్లాడుతూ రహదారి భద్రత అందరి బాధ్యత అన్నారు. జిల్లాలో ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్లు, విద్యాసంస్థల బస్సు డ్రైవర్లను సత్కరించారు. చిత్రలేఖనం, క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఆర్టీసీ డీఎం బి.వాణి, ఆర్‌అండ్‌బీ డీఈ సంఘమిత్ర, రవాణా శాఖ పరిపాలన అధికారులు ఎం.రాము, ఎం.ఆనంద్ కుమార్, వాహన తనిఖీ అధికారులు, ట్రాఫిక్ పోలీస్ రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్పా సెంటర్లను నిషేధించాలి

ఏలూరు (టూటౌన్): మార్గదర్శకాలను ఉల్లంఘిస్తూ, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్పా, మసాజ్ సెంటర్లను నిషేధించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వరక శ్యామల, మన్నవ యామిని శనివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక స్ఫూర్తిభవన్‌లో వారు మాట్లాడుతూ కొందరు ఈజీ మనీ కోసం అడ్డదారులు తొక్కుతున్నారని, మహిళలను బలవంతంగా వ్యభిచార కూపంలోకి లాగి డబ్బులు దండుకుంటున్నారని విమర్శించారు. మధ్యతరగతి, పేద మహిళలను టార్గెట్ చేసి ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి, స్పా సెంటర్లలో చేర్పిస్తున్నారన్నారు. అనంతరం మహిళలను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి దందా దేశంలోని పలు ప్రాంతాల్లో యథేచ్ఛగా సాగుతోందని ఆరోపించారు. పోలీసు శాఖ స్పా, మసాజ్ సెంటర్‌లపై దృష్టి సారించి నిర్వాహకులపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

యర్రగుంటపల్లిలో జీబీఎస్ కలకలం

- ఐదేళ్ల బాలికకు వైరస్ లక్షణాలు
- అప్రమత్తమైన వైద్యారోగ్యశాఖ

చింతలపూడి: మండలంలోని యర్రగుంటపల్లి గ్రామంలో ఐదేళ్ల బాలికకు గులియన్ బారీ సిండ్రోమ్ (జీబీఎస్) వైరస్ లక్షణాలు ఉన్నట్టు భావిస్తున్న వైద్యారోగ్య శాఖ అప్రమత్తం అయ్యింది. బాలికను పరీక్షించిన స్థానిక వైద్యులు మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. ప్రస్తుతం బాలికకు అక్కడి జీజీహెచ్‌లో వైద్యుల పర్యవేక్షణలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. బాలిక నుంచి సేకరించిన శాంపిల్స్‌ను బెంగళూరు పంపించినట్టు వైద్యులు చెప్పారు. ఈ వ్యాధి సోకిన రోగికి ఒళ్లంతా తిమ్మిరిగా మారి కండరాలు పట్టేయడంతో పాటు కండరాలు బలహీన పడతాయి అలాగే డయేరియా, పొత్తి కడుపులో నొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. జలుబు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడతారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో జీబీఎస్ లక్షణాలు బయటపడుతున్న నేపథ్యంలో గ్రామంలో వ్యాధి లక్షణాలు కనిపించడంతో కలకలం రేగింది.

వ్యాధి నిర్ధారణ కాలేదు

బాలిక పరిస్థితిపై పీహెచ్‌సీ వైద్యాధికారి కొత్తపల్లి నరేష్ వివరణ ఇస్తూ యర్రగుంటపల్లిలో బాలికకు జీబీఎస్ సోకినట్టు నిర్ధారణ కాలేదన్నారు. బాలికకు ఉన్న లక్షణాలను బట్టి శాంపిల్స్ సేకరించి నిర్ధారణ కోసం బెంగళూరు పంపారన్నారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్యం నిలకడగా ఉందని చెప్పారు. ముందు జాగ్రత్త చర్యగా శనివారం బాలిక నివసించిన ప్రాంతంతో పాటు గ్రామంలో ఇంటింటా సర్వే చేపట్టామని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని వైద్యాధికారి నరేష్ చెప్పారు.



యర్రగుంటపల్లిలో ఇంటింటా సర్వే చేస్తున్న వైద్యారోగ్య శాఖ సిబ్బంది

జంగారెడ్డిగూడెంలో ఐసోలేషన్ కేంద్రం

జంగారెడ్డిగూడెం: జీబీఎస్ వ్యాధిగ్రస్తుల కోసం జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక ఐసోలేషన్ వార్డును ఏర్పాటు చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ బేబీ కమల మాట్లాడుతూ రాష్ట్రంలో జీబీఎస్ అనుమానిత కేసుల నియంత్రణలో భాగంగా ఇక్కడ ప్రత్యేక ఐసోలేషన్ వార్డును సిద్ధం చేశామన్నారు. కండరాల బలహీనత, జ్వరం వంటి లక్షణాలున్న వ్యక్తులు ఏరియా ఆస్పత్రిలో సంప్రదించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని పరిసరాల శుభ్రతను, బయట ఆహార పదార్థాలను కొన్ని రోజులపాటు పూర్తిగా దూరం పెట్టాలని ఆమె సూచించారు.



జంగారెడ్డిగూడెం ఏరియా ఆసత్రిలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఐసోలేషన్ వార్డు

క్లుప్తంగా

మద్దిలో వసతి గదులకు రూ.10 లక్షల విరాళం



రూ.10 లక్షలు అందజేస్తున్న హైదరాబాద్‌కు చెందిన మహేందర్

జంగారెడ్డిగూడెం : మండలంలోని గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖమండపంపై స్వామివారి ఉత్సవమూర్తికి అర్చక స్వాములు శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ సిబ్బంది భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఆలయం వద్ద నిర్మిస్తున్న వసతి గదుల కోసం హైదరాబాద్ కు చెందిన మహేందర్, లత దంపతులు రూ.10,00,000 విరాళంగా ఇచ్చారని ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



సంకు సూర్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయుడు

తణుకు అర్బన్ : ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలకు తణుకు మండలం మండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సంకు సూర్యనారాయణ ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ఆర్.మోహన్‌బాబు తెలిపారు. గత నెలలో నాగార్జున యూనివర్సిటీలో జరిగిన పోటీల్లో సూర్య నారాయణ 1500 మీటర్ల రన్నింగ్ విభాగంలో ప్రథమ స్థానం సాధించారని చెప్పారు. ఈ నెల 19 నుంచి 21 వరకు చండీగఢ్‌లో నిర్వహించే అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు.

కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్య

దెందులూరు: కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని దెందులూరు పోలీసులు తెలిపారు. ఎస్సై ఆర్.శివాజీ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శెనగల వెంకటేశ్వరరావు (32) కొంతకాలం నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ నెల 10న పురుగుమందు వాసన రావడంతో భార్యం ఏం జరిగిందని అడిగింది. కడుపునొప్పి తాళలేక పురుగుమందు తాగానని చెప్పడంతో వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం ఏలూరు వైద్యశాలకు తరలించారు. వైద్యుల సూచన మేరకు ఏలూరు నుంచి విజయవాడ వైద్యశాలకు తీసుకెళ్లారు. విజయవాడలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

‘చింతలపూడి’ ఎండమావేనా?

- 16 ఏళ్లయినా పూర్తికాని ఎత్తిపోతల పథకం
- అధికారంలోకి వచ్చి 8 నెలలైనా ఊసే ఎత్తని కూటమి ప్రభుత్వం



చింతలపూడి మండలం ఫాతిమాపురం వద్ద చింతలపూడి ఎత్తిపోతల కాల్వ



ఎన్టీఆర్ జిల్లా చీపిరిగూడెం వద్ద చేపట్టిన అక్విడెక్ట్

చింతలపూడి: ప్రభుత్వ తీరు చూస్తుంటే చింతలపూడి ఎత్తిపోతల పథకం ఇక ఎండమావే అనిపిస్తోంది. జిల్లాలో 2 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించే లక్ష్యంతో ప్రారంభించిన ఈ పథకం 16 ఏళ్ళు కావస్తున్నా కొలిక్కి రాలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాబార్డు నుంచి పథకానికి రూ.1931 కోట్ల రుణం మంజూరైంది.

కరోనా మహమ్మారి వల్ల పథకం పనులు ముందుకు సాగలేదు. మొదటి దశ పనులే పూర్తి కాని ఈ పథకానికి 2017లో టీడీపీ ప్రభుత్వ హయాంలో రెండో దశ మంజూరు చేసి భూసేకరణ చేపట్టడంతో అప్పట్లో రైతుల్లో తీవ్ర నిరసన వ్యక్తమైంది. రెండో దశలో కృష్ణా జిల్లాలో మరో 2.80 లక్షల ఎకరాలను చేర్చి ప్రాజెక్టు వ్యయాన్ని రూ.4,909.80 కోట్లకు పెంచారు. ఇందులో మొదటి దశ సామర్థ్యాన్ని పెంచడం వల్ల మరో రూ.808 కోట్లు అదనంగా ఖర్చవుతాయని అంచనా వేశారు. రెండో దశ పనులకు రూ.2,400 కోట్లు అంచనా కట్టారు. మొత్తం 4.80 లక్షల ఎకరాలకు సాగు నీరు, తాగునీరు అందే అవకాశం ఉంది. ప్రధాన కాలువ ద్వారా తొలుత 2 వేల క్యూసెక్కుల నీరు పారడానికి వీలుగా 24 మీటర్ల వెడల్పు, 3.2 మీటర్ల లోతు ఉండేలా తవ్వకం పనులు చేపట్టారు. సామర్థ్యం పెరగడంతో మరో మూడు మీటర్ల మేర కాల్వ ఎత్తు పెంచడానికి నిర్ణయించారు. కాల్వ ఎత్తు పెంచితే కాల్వపై కట్టే వంతెనలు, తూములు నీటి ప్రవాహాన్ని తట్టుకునేలా డిజైన్‌లో మార్పులు చేయాల్సి ఉంటుంది. జల్లేరు వద్ద తొలుత 8 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌ను నిర్మించాలని భావించారు. అది 20 టీఎంసీల సామర్థ్యానికి పెంచారు. ఇప్పుడు ఈ రిజర్వాయర్ పనులను కూడ ప్రభుత్వం పక్కన పెట్టేసినట్లు సమాచారం.

పశ్చిమ రైతుల పట్ల వివక్ష

చింతలపూడి ఎత్తిపోతల పథకం భూసేకరణలో అప్పటి ప్రభుత్వం పశ్చిమ గోదావరి జిల్లా రైతుల పట్ల వివక్ష చూపింది. నష్ట పరిహారం పెంచాలని జిల్లాలోని రైతులు అనేక మార్లు ఆందోళనలు చేపట్టారు. వీరి అభ్యర్థనలను పెడచెవిన పెట్టిన ప్రభుత్వం కృష్ణా జిల్లా రైతులకు మాత్రం రెండో దశ పథకానికి ఎకరానికి 19 లక్షలు చెల్లించేలా జీఓ కూడా విడుదల చేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

భూసేకరణకు ససేమిరా

జిల్లాలో చింతలపూడి ఎత్తిపోతల కాల్వ రైతులు నష్టపరిహారం విషయంలో సంతృప్తిగా లేరు. దీంతో రైతులు భూ సేకరణకు అడ్డు పడుతున్నారు. జిల్లాలోని పట్టిసీమ ప్రధాన కాల్వ కింద టీడీపీ ప్రభుత్వం రైతులకు ఎకరానికి రూ.30 లక్షలు చెల్లించి, చింతలపూడి మండలంలో ఎకరానికి 12.50 లక్షలు ప్రకటించడం, కృష్ణా జిల్లా చాట్రాయి మండలంలోని రైతులకు ఎకరానికి రూ.19 లక్షలు చెల్లిస్తామని ప్రకటించడంతో జిల్లా రైతులు వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో అన్ని ప్రాంతాలకు ఒకే ప్యాకేజీ అమలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ పథకం వల్ల ఎక్కువ ప్రయోజనం కృష్ణా జిల్లాకు కలుగుతుందని ఇక్కడి రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా అవసరాలు తీరాకే కృష్ణా జిల్లాకు నీరు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

చింతలపూడి పథకం ప్రారంభించి దాదాపు 16 ఏళ్లు కావస్తుంది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వచ్చి 8 నెలలు పూర్తి కావస్తోంది. పథకం మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. అధికారంలోకి వస్తే చింతలపూడికి నిధులు కేటాయించి పూర్తి చేస్తామని కూటమి నేతలు చెప్పారు. సప్రస్తుత పరిస్థితి చూస్తుంటే మరో పదేళ్లకైనా పథకం పూర్తవుతుందా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలి



రైతుల నష్ట పరిహారం సమస్యలను పరిష్కరించి వెంటనే చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించాలి. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గడువులోగా పథకాన్ని పూర్తి చేసి మెట్ట రైతులకు సాగు నీరు, జిల్లా ప్రజలకు తాగునీరు అందచేయాలి.

– కంభం విజయరాజు– వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త

మెస్ నిర్వహణ సరిగా లేకపోతే జరిమానా



ట్రిపుల్ ఐటీలో మెస్ మానిటరింగ్ కమిటీ సమావేశం

నూజివీడు: విద్యార్థులకు సరిపడా ఆహార పదార్థాలు అందుబాటులో ఉంచకపోయినా, ఆలస్యమైనా మెస్ నిర్వాహకులకు జరిమానా విధిస్తామని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు. స్థానిక ట్రిపుల్ ఐటీలో మెస్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో శుక్రవారం రాత్రి కోడిగుడ్డు కూరకు బదులుగా క్యాలీఫ్లవర్ కూరను తయారు చేశారని.. మూడు వేల మంది విద్యార్థులకు కూరను సిద్ధం చేసినప్పటికీ సరైన అంచనా లేక 500 మంది విద్యార్థులకు తగ్గడంతో నిర్వాహకులు వెంటనే తయారు చేసి సకాలంలోనే అందించారన్నారు. అనుకోకుండా ఇలాంటి పరిస్థితులు ఎదురైతే ఎలా అధిగమించాలనే దానిపై కూడా చర్చించారు. మెస్ మానిటరింగ్ కమిటీ, ఫుడ్ క్వాలిటీ ఇన్‌చార్జి, మెస్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జిలు నిరంతరం మెస్‌లు పర్యవేక్షించాలన్నారు. నాణ్యత, పరిమాణంలో తేడా రాకుండా చూడాలన్నారు. సమావేశంలో ఏఓ బీ లక్ష్మణరావు, డీన్ అకడమిక్స్ చిరంజీవి, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ బ్రహ్మస్వాములు పాల్గొన్నారు.

పంట కాల్వల్లో వైరస్ కోళ్లు

అధికారుల హెచ్చరికలు ఖాతరు చేయని పౌల్ట్రీ యజమానులు



అత్తిలి మండలం పాలూరు చానల్‌లో పేరుకుపోయిన కోళ్ల మూటలు

అత్తిలి: వైరస్ సోకి చనిపోయిన కోళ్లకు అత్తిలి కాలువ నిలయంగా మారింది. బర్డ్‌ఫ్లూ వ్యాధితో చనిపోయిన కోళ్లను నిబంధనల ప్రకారం పూడ్చిపెట్టాల్సి ఉండగా కొంతమంది పౌల్ట్రీ రైతులు చనిపోయిన కోళ్లను మూటలు కట్టి పంట కాలువలో పడేస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి కొట్టుకు వచ్చిన కోళ్ల మూటలు బ్రాంచ్ కాలువల స్లూయిజ్‌ల వద్ద అడ్డుపడి తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. వారం రోజుల క్రితం స్లూయిజ్‌ల వద్ద పేరుకుపోయిన కోళ్ల మూటలను ఆయా గ్రామాలలో స్థానిక నాయకులు కూలీలతో తొలగించినప్పటికీ, ఎగువ ప్రాంత నుంచి మూటలు కొట్టుకురావడంతో స్లూయిజ్ గేట్ల వద్ద గుట్టలుగా పేరుకుపోయాయి. చనిపోయిన కోళ్లతో పాటు జంతు కళేబరాలు కూడా కొట్టుకురావడంతో స్లూయిజ్‌ల వద్ద తాగునీరు కలుషితం అవుతోంది. అత్తిలి ప్రధాన కాలువ పరిధిలో రేలంగి చానల్, పాలి చానల్, పాలూరు చానల్, ఉరదాళ్లపాలెం చానల్, మంచిలి చానల్, ఈడూరు చానల్‌లో వైరస్ సోకి చనిపోయిన కోళ్ల మూటలు దర్శనమిస్తున్నాయి. మండల ప్రజల సాగు, తాగు నీటి అవసరాలను తీర్చే అత్తిలి కాలువ కాలుష్య కోరల్లో చిక్కుకుంది. కలుషితమైన నీటిని తాగడం ద్వారా ప్రజలు అనేక రోగాలు బారిన పడే ప్రమాదం ఉంది. ఉన్నతాధికారులు చనిపోయిన కోళ్లను కాలువలో వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేస్తున్నప్పటికీ పౌల్ట్రీ రైతులు పట్టించుకోవడం లేదు. రాత్రి సమయంలో కోళ్ల ఫారాల యజమానులు కాలువలో పడేస్తున్నారు. కాలువను కలుషితం చేస్తున్న వారిపై నిఘా ఉంచి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అత్తిలి కాలువను కాలుష్యం బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

మారుతీనగర్‌లో ట్రాక్టర్ దగ్ధం

భీమవరం: భీమవరం పట్టణం మారుతీనగర్‌లో ట్రాక్టర్ దగ్ధంపై మన్నె సాయిశరన్‌తేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై బీవై కిరణ్‌కుమార్ శనివారం చెప్పారు. గాంధీనగర్‌కు చెందిన సాయిశరణ్ తేజ లారీలు కిరాయికి తిప్పుతుంటాడు. తన ట్రాక్టర్‌ను లెప్రసీ కాలనీకి చెందిన ఆర్.చిదంబరంతోపాటు మరికొందరు తగలబెట్టి ఉంటారని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మామిడిలో తెగుళ్ల బెడద

మాడిపోతున్న పూత



మామిడి తోటలు పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నూజివీడు: డివిజన్‌లో విస్తరించి ఉన్న మామిడి తోటలకు ఈ ఏడాది నల్ల తామర, బూడిద తెగుళ్ల సోకడంతో మామిడి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముంది. నూజివీడు నియోజకవర్గంతో పాటు చింతలపూడి, లింగపాలెం మండలాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. పూతలు 80 నుంచి 90 శాతం తోటల్లో వచ్చినప్పటికీ నల్ల తామర, బూడిద తెగుళ్ల వల్ల ఆశించిన స్థాయిలో పిందె కట్టు కనిపించడం లేదు. వాటి వల్ల పూతంతా నల్లగా మాడిపోతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. బంగినపల్లి, తోతాపురి రకం తోటల్లో నల్లతామర ఉధృతి ఎక్కువగా కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో నూజివీడు మామిడి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త బొర్రా కనకమహాలక్ష్మి, శాస్త్రవేత్తలు కే రాధారాణి, శాలిరాజు నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి, ముసునూరు తదితర మండలాల్లో పర్యటించి ప్రస్తుత పరిస్థితులపై రైతులకు సలహాలు, సూచనలు అందజేస్తున్నారు.

నల్లతామర నివారణకు..

నల్లతామర పురుగుల నివారణకు రైతులు థయోమిథాక్సమ్ 25 శాతం 0.3 గ్రాములు లీటరు నీటికి లేదా స్పైనోసాడ్ 45 ఎస్‌సీ 0.3 ఎంఎల్ లీటరు నీటికి లేదా ఫిప్రోనిల్ 40 శాతం, ఇమిడాక్లోప్రిడ్ 40 శాతం 0.2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. మామిడి తోటల్లో నల్ల తామర నివారణకు అక్కడక్కడ నీలిరంగు, పసుపురంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా వాటి ఉధృతి తగ్గించవచ్చన్నారు. నీలి, పసుపు, తెలుపు రంగు చీరలను మడ్డి ఆయిల్‌లో తడిపి తోటల్లో కడితే నల్ల తామర పురుగుల ఉధృతిని సులువుగా నివారించుకోవచ్చు. తోటల్లో అధికంగా పిందె రాలితే ప్లానోఫిక్స్ 0.2 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.



బొర్రా కనక మహాలక్ష్మి, వ్యవసాయ శాస్త్రవేత్త

బూడిద తెగులు నివారణకు..

బూడిద తెగులు నివారణకు హెక్సాకొనజోల్ లేదా ప్రొపికొనజోల్ 2 ఎంఎల్ లేదా టెబుకొనజోల్, ట్రిఫ్లాక్సీస్ట్రోబిన్ 1 గ్రాము పొడి మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. బూడిద తెగులు అధికంగా ఉన్న తోటల్లో పూత నల్లగా మారడంతో పాటు పిందెలు అధికంగా రాలుతున్నట్లు గమనించినందున పిందెలు రాలకుండా తేలికపాటి నీటి తడులు ఇవ్వాలన్నారు. తోటలు శుభ్రంగా ఉంచుకున్న వాటిలో రసం పీల్చే పురుగులు, తెగుళ్ల ఉధృతి తక్కువగా ఉందన్నారు.



బూడిద తెగులు ఆశించడంతో మాడిపోయిన పూత


పేదల వ్యతిరేక బడ్జెట్



భీమవరం ప్రకాశంచౌక్ సెంటర్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా

భీమవరం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పేదల వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల బడ్జెట్‌ను తక్షణం ఉపసంహరించుకోవాలని వామపక్ష పార్టీలు హెచ్చరించాయి. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ శనివారం భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్‌లో వామపక్ష పార్టీల అధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి.బలరామ్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ రైతులకు ఆత్మహత్యలను పురుకొల్పేలా ఉందని మండిపడ్డారు. సామాన్యులు, కౌలు రైతు, కార్మిక, రైతు కూలీలను మోసం చేసే బడ్జెట్‌పై రాష్ట్రపతి తక్షణం జోక్యం చేసుకుని పార్లమెంట్‌కు తిప్పి పంపాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేకమన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానన్న ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేయడమేగాక ఉద్యోగం, ఉపాధికి నిధులు కేటాయించలేదని కోనాల విమర్శించారు. ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంక కృష్ణమూర్తి, సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వీ గోపాలన్, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శ్రీవారి క్షేత్రం



భక్తులతో నిండిన దర్శనం క్యూలైన్లు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వేలాది మంది భక్తులు చినవెంకన్నను దర్శించారు. తెల్లవారుజామునుంచే భక్తుల రాక మొదలవడంతో ఆలయ పరిసరాలు కళకళలాడాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లతో పాటు, అనివేటి మండపం, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కల్యాణకట్ట ఇలా అన్ని విభాగాలు భక్తులతో పోటెత్తాయి. ఉచిత అన్నప్రసాదం కోసం అన్నదాన భవనం వద్ద భక్తులు బారులు తీరారు. అలాగే పార్కింగ్ ప్రదేశాలు వాహనాలతో నిండిపోయాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

కొట్లాట కేసు నమోదు

భీమవరం: భీమవరం పట్టణం మెంటేవారితోటలో ఇరువర్గాలు ఘర్షణ పడగా కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై బీవై కిరణ్‌కుమార్ శనివారం చెప్పారు. శుక్రవారం సాయంత్రం మెంటేవారితోటకు చెందిన ముత్యాలపల్లి సాయివంశీ అదే ప్రాంతానికి చెందిన కేశవరపు శివరమేష్ వర్గాలు కొట్టుకున్నాయి. గాయపడిన వారిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రిలో చేరగా.. అక్కడి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

టెక్నాలజీని వినియోగించుకోవాలి



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: ప్రపంచంలో కొన్ని దేశాలలో అపారమైన సహజ వనరులున్నప్పటికీ టెక్నాలజీ లేకపోవడంతో సహజ సంపద ఇతర దేశాలకు అందించి తిరిగి వారి వద్దే ఉత్పత్తులు కొనుగోలు చేసుకుంటున్నారని చెన్నైకి చెందిన ఇండియన్ పేటెంట్ డిప్యూటీ కంట్రోల్ ఆఫ్ పేటెంట్స్ అండ్ డిజైన్ ఎం.రాం జవహర్ అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 24 గంటల పాటు నిర్విరామంగా నిర్వహించిన హ్యాకథాన్ పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. మనకు లభ్యమవుతున్న సహజ సంపద పూర్తిస్థాయిలో వినియోగించుకుని దేశం ప్రగతి సాధించాలంటే టెక్నాలజీ ఎంతో అవసరమన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ విద్యార్థులు వినూత్న ఆలోచనలను ఆచరణలోకి తీసుకువచ్చేందుకు ఐడియా ల్యాబ్ టెక్నాలజీ సెంటర్లు తమ కళాశాలలో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కెనరా బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ తోట రవిచంద్ర మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతికి కెనరా బ్యాంక్ తమ వంతు సహకారం అందజేస్తుందన్నారు. ఈ పోటీల్లో అమరావతి వీఐటీ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ఫైనలియర్ విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుచుకోగా రూ. 12 వేలు నగదు బహుమతి అందజేశారు. ద్వితీయ స్థానం తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్ కళాశాలకు, తృతీయ స్థానం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు నిలిచారు. ఐటీ డిపార్ట్‌మెంట్ హెడ్ పి రవికిరణ్‌వర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సెంటర్ డైరెక్టర్ కె.నాగఆదిత్యవర్మ, బ్రెయిన్ నో విజన్ టీం ఐటీ విభాగం ప్రొఫెసర్ ఐ.హేమలత, కె.కిషోర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజబాబు మృతి



ద్వారకాతిరుమల: మండలంలోని సీహెచ్ పోతేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజమోహన్‌రావు(రాజబాబు) శనివారం రాత్రి మృతి చెందారు. ఇటీవల బాత్‌రూమ్‌లో కాలుజారి పడిపోవడంతో ఆయన ఎడమ కాలికి తీవ్ర గాయమైంది. కొద్దిరోజుల పాటు లక్ష్మీపురంలోని విర్డ్ ఆస్పత్రిలో చికిత్స పొందిన ఆయన, శస్త్రచికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని సిటీ న్యూరో ఆస్పత్రిలో చేరారు. అక్కడ వైద్యులు వారం రోజుల క్రితం ఆయన కాలికి శస్త్రచికిత్స చేశారు. ఈ నెల 12న ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అవ్వాల్సి ఉండగా, అదే రోజు ఉదయం 11.30 గంటల సమయంలో ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. అప్పటి నుంచి వైద్యులు ఆయనకు వెంటిలేటర్ సాయంతో వైద్యం చేస్తూ వచ్చారు. పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. రాజబాబు మృతి చెందడంతో మండలంలోని పార్టీ శ్రేణులు, ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

భీమవరం: అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు వేధిస్తున్నారంటూ భీమవరం పట్టణం గునుపూడికి చెందిన గోరుముచ్చు సిరివెన్నెల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ జీజీఎస్ఎస్ చక్రవర్తి శనివారం చెప్పారు. కృష్ణాజిల్లా బంటుమిల్లి మండలం మల్లేశ్వరం గ్రామానికి చెందిన గోరుముచ్చు కల్యాణ్‌బాబుతో 2023 జూన్ 16న సిరివెన్నెలకు వివాహమైంది. పెళ్లి సమయంలో రూ.3 లక్షలు కట్నంగా ఇచ్చారు. ఇటీవల అదనపు కట్నం తీసుకురావాలంటూ వేధించడంతో సిరివెన్నెల ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చక్రవర్తి చెప్పారు.

శ్రీవారి ట్రస్టుకు రూ. 6.01 లక్షల విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు భక్తులు వేర్వేరుగా శనివారం రూ.6.01 లక్షలు విరాళంగా అందజేశారు. అత్తిలి మండలానికి చెందిన తమ్మినీడి నాగ విష్ణు రామకృష్ణారావు రూ.5,01,116, గుంటూరుకు చెందిన మరో భక్తుడు రూ.1,00,000 వెరసి రూ. 6,01,116 ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాత రామకృష్ణారావుకు ఆలయ ఇన్‌చార్జి ఈఓ వేంద్ర త్రినాథరావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

క్లుప్తంగా

వరాల వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఈడూరులో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

అత్తిలి: ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారిని తులసి మాలలు, పలు రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పరిసర గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు.

తణుకు కోర్టు ఏజీపీగా అప్పాజీ



గాజుల వీరవెంకట అప్పాజీ, తణుకు

తణుకు అర్బన్: తణుకు కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ అడ్వకేట్ (ఏజీపీ)గా తణుకుకు చెందిన గాజుల వీర వెంకట అప్పాజీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2005 సంవత్సరం నుంచి న్యాయవాదిగా తణుకు కోర్టులో విధులు నిర్వర్తిస్తున్న అప్పాజీ నియామకంపట్ల తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి, అసోసియేషన్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక హౌసింగ్ బోర్డు శ్రీ సువార్చల సమేత దక్షిణ ముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తులు సామూహిక సిందూరార్చనలు జరిగాయి. ఆలయ నిర్వాహకులు ఆకుల నరసింహమూర్తి మాట్లాడుతూ హనుమాన్ జయంతి వరకు ప్రతి శనివారం, ఇతర ప్రత్యేక రోజుల్లో విశేష పూజలు జరుగుతాయని తెలిపారు. భక్తులు హాజరై స్వామి వారిని దర్శించాలని కోరారు.

సమగ్ర పోషణ.. నాణ్యమైన విద్య



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న పోషణ బీ – పడాయి భీ కార్యక్రమం శిక్షణ తరగతులు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు డి.ఎస్తేరు రాణి, జి.బేబి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ బాలికలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. బాలికల చదువుతోనే కుటుంబం విద్యాపరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని 18 ఏళ్ల లోపు బాలికలకు క్రమం తప్పకుండా అందించాలన్నారు. పోషకాహారం లోపు లేకుండా విద్య ప్రాధాన్యతను వివరించారు. అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పెంటపాడు: పోషణ్‌బీ– పడాయిభీ శిక్షణలో భాగంగా పలు ప్రాంతాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు శనివారంతో ముగిసాయి. గూడెం మండలం కృష్ణాయిపాలెం జెడ్పీస్కూల్, పెంటపాడు మండలం మీనవిల్లూరు, పెంటపాడు పోస్టుబేసిక్‌స్కూల్‌లో ఐసీడీఎస్ సిబ్బంది నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు ముగిసాయి. ఈ కార్యక్రమంలో గూడెం, పెంటపాడు, టౌన్ ప్రాంతాలకు చెందిన ఐసీడీఎస్ సిబ్బందితో పాటు, సూపర్‌వైజర్‌లు దుర్గాభవాని, జీజీబీ విజయలక్ష్మి, సుజాత, ఎస్తేరురాణి, శ్రీదేవి, బేబీ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని కోరుతూ శనివారం యాగర్లపల్లి పరిధిలోని 22, 23, 24,25 వార్డులలో వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలు జరిగాయి. ర్యాలీలు, ప్రజలకు అవగాహన కల్పించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఆరోగ్య కార్యదర్శులు ఆదిలక్ష్మి, జ్యోతి, ఆశాలు, కాంతారావు పాల్గొన్నారు.

మటన్, చేపలు, రొయ్యలకు పెరిగిన డిమాండ్

- కిటకిటలాడుతున్న దుకాణాలు
- చికెన్ లేకపోవడంతో స్వల్పంగా పెరిగిన మటన్ ధరలు



తణుకు స్త్రీసమాజం రోడ్డులో చేపలు, సీఫుడ్స్ దుకాణం



తణుకు సొసైటీ రోడ్డులో మటన్ దుకాణం

తణుకు అర్బన్: కోళ్లను బర్డ్‌ఫ్లూ భూతం కాటేయడంతో మాంసాహారులకు చికెన్ దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల ఆదేశాల మేరకు చికెన్ దుకాణాలు పూర్తిగా మూతపడడంతో చికెన్ ప్రియులు అల్లాడిపోతున్నారు. హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ల్లో సైతం చికెన్ దొరక్కపోవడంతో ప్రత్యామ్నాయం కోసం వెతుకులాడుతున్నారు. ఈ నేపథ్యంలో చేపలు, రొయ్యలు, మటన్ దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. తణుకు పట్టణంలోని సంతమార్కెట్ ప్రాంతంతోపాటు స్త్రీసమాజం రోడ్డు, వేల్పూరు రోడ్డు, సొసైటీ రోడ్డు, పెద్ద వంతెన ప్రాంతాల్లో ఉన్న చేపలు, మటన్ దుకాణాలకు మాంసాహారప్రియులు క్యూకడుతున్నారు.

పెరిగిన ధరలు..

చికెన్ అందుబాటులో లేని నేటి పరిస్థితుల్లో అధికంగా మటన్ కొనుగోళ్లకు మాంసాహారులు ప్రాధా న్యత చూపుతున్నారు. దీంతో బర్డ్‌ఫ్లూ అంశం లేని రోజుల్లో మటన్ ధర కిలో రూ. 850 నుంచి రూ. 900లకు అమ్మకాలు జరగ్గా నేడు రూ. 900నుంచి రూ. 1000లకు పెంచి విక్రయాలు చేస్తున్నారు. మటన్‌కు డిమాండ్ పెరగడంతో ధర కూడా పెంచి అమ్మకాలు చేస్తున్న పరిస్థితి తణుకులో నెలకొంది. ఇక చేపలు కిలో రూ. 160 నుంచి రూ. 180లకు గతంలో మాదిరిగానే విక్రయాలు చేస్తుండగా, గోదావరి రొయ్య లు పెద్ద సైజు కిలో ధర రూ. 400లకు, చాకు రొయ్యలు సైజును బట్టి కిలో రూ. 300 నుంచి రూ. 500ల వరకు అమ్మకాలు చేస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

హోటల్స్‌లో చికెన్‌కు ప్రత్యామ్నాయంగా..

హోటల్స్‌లో చికెన్‌కు ప్రత్యామ్నాయంగా మటన్‌కు అధికంగా ప్రాధాన్యతనిస్తుండగా, చిన్నపాటి హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లలో బిర్యానితో మటన్ కైమా, రొయ్యలు, మేక తలకాయ మాంసం, బోటీలను కూరలుగా వండి అమ్మకాలు చేస్తున్నారు. బిర్యానీతో చేపల పులుసు కూడా విక్రయిస్తున్నారు. స్ట్రీట్ ఫుడ్ బళ్లలో ఫ్రైడ్‌రైస్, నూడుల్స్ సైతం కోడిగ్రుడ్లు లేకపోవడంతో వెజ్ ఐటెంగా అమ్మకాలు చేస్తున్నారు. ఎన్నిరకాల ప్రత్యామ్నాయం చేసినా చికెన్‌ను బీట్ చేయలేవంటూ మాంసాహారులు అభిప్రాయపడుతున్నారు. మాంసాహారంలో చికెన్ ఒక్కదానినే రకరకాల రూపాల్లో తీర్చిదిద్ది లొట్టలేసుకుంటూ తినే పరిస్థితి ఉండగా మిగిలిన మాంసాహారంలో అన్ని రకాలుగా స్పెషల్స్ చేసుకునే పరిస్థితి ఉండకపోవడంతో మాంసాహారులు మార్కెట్‌లోకి చికెన్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూపులు చూస్తున్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం



అలంపురంలో హెచ్‌ఎం శారధను సన్మానిస్తున్న యర్నగూడెం హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు

పెంటపాడు: విద్యార్థులు విద్యతో పాటు సేవాకార్యక్రమాలు చేయడం అభినందనీయమని అలంపురం జెడ్పీస్కూలు హెచ్‌ఎం టి. శారద పేర్కొన్నారు. గతంలో తాను పనిచేసిన యర్నగూడెం బొల్లిన గంగరాజు జెడ్పీస్కూల్ విద్యార్థులు హెల్పింగ్ హ్యాండ్స్‌గా ఏర్పడి గత కొన్నేళ్లుగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆ సొసైటీ సభ్యులు అలంపురంలో హెచ్‌ఎం చేతుల మీదుగా సొసైటీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సొసైటీ అధ్యక్షుడు కావలిపురపు బాలకృష్ణ, కార్యదర్శి గన్ని ప్రసాద్, తనూజ, శివకుమార్, చంద్రశేఖర్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు చేస్తున్న పలు సేవాకార్యక్రమాల పట్ల పూర్వ విద్యార్థులను ఈ సందర్భంగా హెచ్‌ఎం శారద ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా గార్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ



మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణను సన్మానిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పుల్లాయగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీగార్లమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. తొలుత గోదృష్టి, అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యాన్ని కల్పించారు. మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం నాయుడు, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, సర్పంచ్ చీకట్ల పుష్పలక్ష్మీకుమారి, సేవాదళ్ మండల చైర్మన్ కొండుబోయిన కృపావరం, చీకట్ల మల్లేశ్వరరావు, కర్రి భాస్కరరావు, ముప్పిడి సంపత్‌కుమార్, బొద్దాని శ్రీనివాస్, కొలుకులూరి ధర్మరాజు తదితరులు దర్శించుకున్నారు. విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని ఆడపడుచులు, బంధువులతో గ్రామం కళకళలాడింది.

కుంచనపల్లిలో శ్రీవారి విగ్రహ ప్రతిష్ఠ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి ద్వారకానగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. గత మూడురోజులుగా టీటీడీ ఆగమ శాస్త్ర ప్రకారం శాస్త్రోక్తంగా పూజ, హోమాలు నిర్వహించారు. పూర్ణాహుతితో ప్రతిష్ఠ మహోత్సవాలు ముగిశాయి. శనివారం స్వామి, అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ, గోదృష్టి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే శ్రీనివాస్‌లు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ దాసరి మల్లికార్జునరావు, కమిటి ప్రతినిధులు ఆత్కూరి పవన్ కుమార్, కామేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి భాస్కరరావు, ముప్పిడి సంపత్‌కుమార్, కొలుకులూరి ధర్మరాజు, సోషల్ మీడియా కన్వీనర్ కనుపూరి ఉదయ్‌భాస్కర్, బొద్దాని శ్రీనివాస్, జడ్డు హరిబాబు, గార్లపాటి వీర కుమార్, చెన్నా జనార్థన్‌రావు, సిర్రాపు శాంతకుమార్, కామన చంద్రరావు పాల్గొన్నారు.

పౌల్ట్రీ రైతులు, కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలి

తణుకు అర్బన్: బర్డ్ ఫ్లూ వ్యాప్తి కారణంగా కోళ్ల ఫారమ్‌లలో ఉపాధి కోల్పోయిన కూలీల కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ళ చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బర్డ్ ఫ్లూ వ్యాపించిన కారణంగా కోళ్ల ఫారాలు నడుపుతున్న పౌల్ట్రీ రైతాంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయి ఆర్థికంగా చాలా నష్టపోయారని, మూడు నెలల పాటు కోళ్ల ఫారాలు మూసివేయాలని అధికారులు ఆంక్షలు విధించడంతో అటు పౌల్ట్రీ రైతులతో పాటు పౌల్ట్రీల్లో పని చేసే కూలీలు, కోళ్లకు అవసరమైన మేతలు ఎగుమతి దిగుమతి చేసే వ్యాపారులు, కార్మికులు, కోడిగుడ్లు ఎగుమతి చేసే కార్మికులు, మాంసం విక్రయించే వ్యాపారులు ప్రత్యక్షంగా పరోక్షంగా వేలాది కుటుంబాలు తీవ్రంగా నష్టా పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే వ్యవసాయ రంగంలో ఇటీవల యాంత్రీకరణ వినియోగం పెరిగిపోవడం, రియల్ ఎస్టేట్ పేరుతో సారవంతమైన వ్యవసాయ పంట భూములు ఇళ్ల స్థలాలుగాను, చేపలు, రొయ్యల చెరువులుగా మారిపోవడం వలన ఉపాధి కోల్పోయిన గ్రామీణ ప్రాంత వ్యవసాయ కూలీలకు కొంతమేర పౌల్ట్రీ రంగం వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. జిల్లాలో వేలాది మంది కుటుంబాలకు పౌల్ట్రీ రంగం ఉపాధి కల్పించడంలో జీవనాధారంగా నిలిచిందన్నారు. అటువంటి పౌల్ట్రీ రంగం బర్డ్ ఫ్లూ వ్యాధి వ్యాప్తితో సంక్షోభంలో కూరుకు పోయిన కారణంగా ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న కూలీలందర్నీ యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలని వీరభద్ర రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి, న్యాయమూర్తులు

తణుకు అర్బన్: వచ్చేనెల 8వ తేదీన తణుకు కోర్టులో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు కోర్టు పరిధిలోని పోలీసు, ఎక్సైజ్ అధికారులు కృషి చేయాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి పిలుపునిచ్చారు. తణుకు కోర్టులో పోలీసు అధికారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడారు. రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులతోపాటు, చెక్కు బౌన్స్, ఎక్సైజ్, కుటుంబ తగాదాలు, ప్రామిసరి నోటు, సివిల్ కేసులు రాజీ చేసేందుకు కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. చిన్న చిన్న కేసులు రాజీ చేసుకొనుట వలన వారి విలువైన సమయం, డబ్బును ఆదా చేసుకోవచ్చనే విషయాన్ని వారికి అవగాహన కలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణసత్యలత, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పీవీఎన్ రంజిత్ కుమార్, స్పెషల్ కోర్టు జడ్జి పీఎస్‌పీ చిరంజీవి రావు, బెంచ్ కోర్టు మెజిస్ట్రేట్ తాడి ఆంజనేయులు, తణుకు, తణుకు రూరల్, ఇరగవరం, నిడదవోలు, పెరవలి, ఎస్సైలు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఎస్సైలు, కోర్టు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి



జగన్నాథపురం గ్రామంలో జరిగిన భవన నిర్మాణ కార్మికుల సంఘ సమావేశం

తాడేపల్లిగూడెం రూరల్: భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దానవరప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో దుర్గారావు అధ్యక్షతన భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దానవరప్రసాద్ మాట్లాడుతూ సంక్షేమ బోర్డు నిధులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఉపయోగించాలన్నారు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు స్పష్టం చేసినప్పటికీ కోర్టులను కూడా లెక్క చేయకుండా వ్యవహరించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఇప్పటికైనా భవన నిర్మాణ కార్మికులకు యాక్సిడెంట్ బెనిఫిట్, ప్రసూతి, మ్యారేజ్, గాయాలు, నిర్మాణ కార్మికులకు కిట్లు, ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎం.సత్తిపండు, ఎన్.సత్తిబాబు,సత్యనారాయణ, సతీష్, రాంబాబు, నాగరాజు, రాము, సుబ్బారావు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ యోజనతో మేలు



సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: ఇంటి పైకప్పుపై సోలార్ పలకాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులు తగ్గించుకొనేందుకు పీఎం సూర్యఘర్ ఎంతో ఉపయోగపడుతుందని విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎ.రఘునాథబాబు అన్నారు. శనివారం అత్తిలి షాదీఖానా భవనంలో ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఈ రఘునాథబాబు మాట్లాడుతూ చాలా తక్కువ వ్యయంతో సోలార్ ప్యానల్స్‌ను సబ్సీడీతో ఏర్పాటు చేసుకోవచ్చని, పలు నేషనల్ బ్యాంకులు ఎటువంటి గ్యారంటీ లేకుండా రుణాలు కూడా అందజేస్తుందన్నారు. ఒక్కో ఇంటికి గరిష్ఠంగా 3 కిలో వాట్ల వరకు సోలార్ ప్యానల్స్‌ను అమర్చుకోవచ్చని చెప్పారు. ఇందుకు గాను కేంద్ర ప్రభుత్వం రూ. 78 వేల చొప్పున సబ్సీడీని అందజేస్తోందన్నారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈపథకంవల్ల కలిగే పలు ప్రయోజనాలను పలు కంపెనీలకు చెందిన సోలార్ వెండర్స్ విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఈఈ కె నరశింహమూర్తి, డీఈ పి శ్రీనివాసు, అత్తిలి ఏఈ కె నాగరాజు, టీడీపీ, జనసేన మండలాధ్యక్షులు ఆనాల ఆదినారాయణ రావు, దాసం ప్రసాద్, పూతినీడి శ్రీనివాస్, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో సౌత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు, పెయింటింగ్ వర్కుల నిమిత్తం ఎస్ఎస్ పెంటపాడు, జువ్వలపాలెం పరిధిలో ఈ నెల 16వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి తెలిపారు. జువ్వలపాలెం, సవిత్రుపేట, కొత్తగూడెం, నవ్వారుపేట, తణుకు, బైపాస్ రోడ్డు, బీఆర్ మార్కెట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ

తణుకు అర్బన్: ఆస్పత్రి ఆవరణలో పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆస్పత్రిలో వైద్యవర్గాలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధుల వ్యాప్తిని నిరోధించగలమని చెప్పారు. ఆర్ఎంవో డాక్టర్ సాయిబాలాజీ, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ శారద ప్రసూన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య కార్మికులు పాటుపడుతున్నారని వారికి రోగులు, సహాయకులు కూడా సహకరించాలని కోరారు. నిత్యం కార్మికులు అందిస్తున్న పారిశుధ్య సేవలు అందరి ప్రశంసలు పొందుతున్నాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు ఎన్‌వీ రాజరాజేశ్వరి, ఎన్‌కే షకీలబేగం, కీర్తి, ఉషారాణి, దుర్గాభవాని, చక్రధర్, దివ్య, ప్రశాంతి, ఉద్యోగులు నరసింహ, ప్రవీణ్ పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే ఆరోగ్యవంతమైన జీవనం



తాడేపల్లిగూడెం రూరల్: నవాబుపాలెంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛదివస్ ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో ఎం.విశ్వనాథ్



తాడేపల్లిగూడెం(టీఓసీ): ర్యాలీ నిర్వహిస్తున్న మునిసిపల్ అధికారులు



ఉద్యాన వర్సిటీలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



సంజీవనగర్ స్కూల్‌లో స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: స్వచ్ఛతతోనే ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ అన్నారు. శనివారం మండలంలోని నవాబుపాలెం, కృష్ణాయపాలెం, కొమ్ముగూడెం గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛదివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ విద్యార్థులకు స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో విశ్వనాథ్ మాట్లాడుతూ ఇళ్లల్లోని తడి, పొడి చెత్తలను వేర్వేరుగా పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. ఇలా సేకరించిన చెత్తను నాడెప్ పిట్‌లలో వేసి కంపోస్టు తయారు చేయడం జరుగుతుందన్నారు. వర్మీ కంపోస్టు ద్వారా నాణ్యమైన పంటలను పండించవచ్చని సూచించారు. కొమ్ముగూడెం సర్పంచ్ తాడేపల్లి బేబి, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు వై.హరి కిషోర్, వి.వాణి, మహ్మద్, ఎమ్మార్సీ రవికిరణ్, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా, ఆరోగ్య సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్, క్లీన్ అండ్ గ్రీన్, తడి చెత్త, పొడి చెత్త ఇవ్వాలని కోరుతూ కమిషనర్ ఏసుబాబు ఆధ్వర్యంలో స్థానిక మునిసిపల్ కార్యాలయం నుంచి తాలూకా ఆఫీస్ సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో మునిసిపల్ అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, సచివాలయం సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. తాలూకా సెంటర్‌లో మానవహారం, ప్రతిజ్ఞలు జరిగాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని, తడి చెత్త, పొడి చెత్త విడదీసి పారిశుద్ధ్య సిబ్బంది అందజేయాలని తెలిపారు.

భవిత సెంటర్‌లో

భవితసెంటర్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులచే ఫ్లాష్ కార్డ్స్‌తో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర అంటూ ర్యాలీ జరిగింది. హెచ్‌ఎం బి.జ్యోతి, ఉపాధ్యాయుని కె.కుమారి, భవిత ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, నాగలక్ష్మి, రత్నకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం జరిగింది. ప్రతిజ్ఞ చేశారు. ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఎస్.సూర్యకుమారి, రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు మేరకు ప్రతి నెల 3వ శనివారం పరిసరాల స్వచ్ఛత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ఇవ్వడం, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. స్వర్ణ ఏపీగా తయారు చేసేందుకు ఎవరి వంతు వారు కృషి చేయాలని కోరారు. ఉన్నత అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చునని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన వద్ద స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఈ.స్వరాజ్యలక్ష్మి పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్టేషన్ అధికారిణి, సిబ్బంది ఆధ్వర్యంలో స్టేషన్, చుట్టూ పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఆవరణలో మొక్కలు నాటారు. అదే విధంగా స్థానిక పాతూరు సంజీవనగర్ స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులకు స్వచ్ఛత, శుభ్రత అంశాలపై అవగాహన కల్పించారు. పొడిచెత్త, తడిచెత్తలను వేరు చేయాలని, పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.బ్రహ్మం, పీఈటీ బి.శ్రీనివాస్, ఎస్ఐలు మురళీమోహన్, దొరబాబు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుద్రాక్షలతో ముస్తాబైన వరసిద్ధి వినాయకుడు



రుద్రాక్షలతో ముస్తాబైన వరసిద్ధి వినాయకుడు

తణుకు అర్బన్: స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం స్వామివారిని రుద్రాక్షలతో ముస్తాబుచేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదములు స్వీకరించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొమ్మిరెడ్డి సూరిబాబు ఆధ్వర్యంలో పూజాధికాలు నిర్వహించారు.